క్లుప్తంగా

ఆవులను రోడ్లపై వదిలితే కఠిన చర్యలు

సాక్షి ఎఫెక్ట్

కోడూరు: ఆవులను రోడ్లపై వదిలితే వాటి యాజమానులపై కఠిన చర్యలు తప్పవని కోడూరు పంచాయతీ కార్యదర్శి యలవర్తి సుబ్రహ్మణ్యం హెచ్చరించారు. ఈ నెల 14న 'రోడ్లపై యథేచ్ఛగా పశువులు' శీర్షికతో సాక్షి దినపత్రికలో వచ్చిన కథనంపై పంచాయతీ అధికారులు స్పందించారు. సంబంధిత పశువుల యజమానులకు పంచాయతీ నుంచి నోటీసులు జారీ చేశారు. ఆవులు రోడ్లపై సంచరించడం వల్ల ట్రాఫిక్ సమస్య తలెత్తడంతో పాటు సంతలో కూరగాయాలను ధ్వంసం చేస్తున్నాయని, వీటిని నియంత్రించని పక్షంలో చట్టపరంగా చర్యలు తీసుకుంటామని నోటీసుల ద్వారా ఆవుల యజమానులకు కార్యదర్శి స్పష్టం చేశారు.

19న మండల పరిషత్ సర్వసభ్య సమావేశం

మోపిదేవి: మండల ప్రజా పరిషత్ సర్వసభ్య సమావేశం ఈనెల 19వ తేదీ కార్యాలయ ఆవరణలో మధ్యాహ్నం 2 గంటలకు మండల పరిషత్ ఉపాధ్యక్షురాలు నడకుదుటి జననీకుమారి అధ్యక్షతన నిర్వహించనున్నట్లు ఎంపీడీవో కె.రామలింగేశ్వరావు తెలిపారు. ప్రజా ప్రతినిధులు, ఉన్నతాధికారులు హాజరవుతారని చెప్పారు. మండల స్థాయి అధికారులు తగు సమాచారంతో సమావేశానికి హాజరుకావాలని కోరారు.

వృద్ధాశ్రమ భవన నిర్మాణానికి విరాళం



చల్లపల్లి(అవనిగడ్డ): చల్లపల్లిలోని సియోను అనాథ వృద్ధాశ్రమం భవన నిర్మాణానికి విజయవాడకు చెందిన షిర్డీసాయి సేవాసంస్థ సభ్యులు రూ.40 వేలు విరాళంగా అందించారు. వృద్ధాశ్రమంలో భవన నిర్మాణ విషయమై చల్లపల్లి ఉప సర్పంచ్ ముమ్మనేని నాని ద్వారా తెలుసుకున్న సంస్థ నిర్వాహకులు శీలం భాస్కరరావు దంపతులు నాని చేతుల మీదుగా ఈ సహాయాన్ని వృద్ధాశ్రమం నిర్వాహకులకు అందించారు. సంస్థ ప్రతినిధులు నాదెళ్ల ఉమాదేవి, వి.కామేశ్వరి, జి.మహాలక్ష్మి, ఎం.నళిని, పి.విజయలక్ష్మి, గొర్రెపాటి పిచ్చేశ్వరరావు, రిటైర్డ్ ఈవోపీఆర్డీ దాసి సీతారామరాజు పాల్గొన్నారు.

ఎరువులు, పురుగు మందుల షాపుల్లో తనిఖీ



మోపిదేవి: స్థానిక ఎరువులు, పురుగు మందుల షాపులను వ్యవసాయ శాఖ గన్నవరం ఏడీఏ టీ శ్రీనివాస్ మంగళవారం సాయంత్రం ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. తొలుత స్టాక్ రిజిస్టర్లు, ఎరువులు, పురుగు మందుల నిల్వలను పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ డీలర్లు తప్పని సరిగా కొన్ని నియమాలు పాటించాల్సి ఉంటుందన్నారు. స్టాక్ రిజిస్టర్ అప్డేట్‌గా ఉండాలని, ఫిజికల్‌గా ఉన్న స్టాక్‌కు ఈ పాస్ మిషన్‌లో ఉన్న స్టాక్‌కు రికార్డుల్లో ఉన్న స్టాక్‌కు ఎలాంటి తేడాలు ఉండకూడదని తెలిపారు. పురుగు మందులు ఏపీసీ నుంచి తెస్తున్నారో ఆ ఫీసీలు ఖచ్చితంగా ఉండేలా చూడాలని, ప్రతి నెలా స్టాక్ రిపోర్టును ఏఓకు తప్పని సరిగా అందజేయాలని ఆదేశించారు. జీఎస్టీ, లైసెన్సులో గోడౌన్ నంబర్ నమోదు చేసి ఉండాలని సూచించారు. స్టాక్ బోర్డులలో స్టాక్ రిపోర్టును ప్రతి రోజూ అప్డేట్ చేయాలని స్పష్టం చేశారు. మండల ఏఓ కే హెప్సిబారాణి, ఏఈవో సుదర్శన్ సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా కార్మెల్‌మాత మహోత్సవం

పెనమలూరు: కానూరు కార్మెల్ మాత పుణ్యక్షేత్ర మహోత్సవం మంగళవారం ఘనంగా నిర్వహించారు. విచారణ గురువు ఫాదర్ సలివేంద్ర శౌరి ఆధ్వర్యంలో నవ దిన ప్రార్థనలు భక్తిశ్రద్ధలతో చేశారు. విజయవాడ మేత్రాసన పీఠాధిపతులు బిషప్ తెలగతోటి జోసెఫ్ రాజారావు దివ్యబలి పూజలు చేసి వెయ్యి మంది విశ్వాసకులకు దివ్య ప్రసాదం అందజేశారు. పది, ఇంటర్‌లో మార్కులు ఎక్కువ సాధించిన విద్యార్థులకు నగదు ప్రోత్సాహకాలు అందజేశారు. కార్యక్రమంలో ఫాదర్లు దేవదానం, రత్నరాజు, ఆనంద్, సీటీసీ సిస్టర్స్, ఉపదేశకులు, కౌన్సిల్ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు. భక్తులు వేసిన మేరీమాత వేషధారణ అందరిని ఆకట్టుకుంది.

నాయకత్వ లక్షణాలు ఉండాలి

గుడివాడ టౌన్: విద్యార్థి దశ నుంచే నాయకత్వ లక్షణాలు పెంపొందించుకుంటే, సమాజానికి ఎంతగానో ఉపయోగపడతాయని వన్ టౌన్ సీఐ రమేష్ అన్నారు. స్థానిక రవీంద్ర భారతి హైస్కూల్లో మంగళవారం క్లాస్ లీడర్స్, స్కూల్ లీడర్(ఎస్‌పీఎల్) బాధ్యతల స్వీకరణ కార్యక్రమంలో మాట్లాడారు. విద్యార్థుల్లో పోటీతత్వం పెరగాలంటే ఈ విధమైన కార్యక్రమాలు అవసరం అన్నారు. క్లాస్ లీడర్స్‌గా ఎన్నికైన వారిలో బాధ్యతలు పెరుగుతాయని, అవి వారి జీవితంలో కూడా ఎంతగానో తోడ్పడతాయన్నారు. ప్రిన్సిపాల్ ప్రియాంక పాల్గొన్నారు.

వరి నారు సంరక్షణ ఇలా..!

ఘంటసాల కృషి విజ్ఞాన కేంద్రం ప్రోగ్రాం కో ఆర్డినేటర్ డాక్టర్ శ్రీలత



ఘంటసాల: కృష్ణా జిల్లాలో ఖరీఫ్ వరి సాగు మొదలైంది. దమ్ము చేయడం మొదలు నారుమడి పెంపకం, నాట్లు వేసుకోవడం వరకు అన్ని పనులు సాగుతున్నాయి. మెట్టప్రాంతంలో చాలా చోట్ల బోరు సాయంతో నార్లు వేసుకోవడంతో పాటు నాట్లు నాటడం కూడా ముమ్మరంగా జరుగుతున్నాయి. అయితే బోర్ల నీటి సదుపాయం లేని రైతులు కాలువ నీరు, వర్షాల పైన ఆధారపడుతున్నారు.

వర్షాల నుంచి సంరక్షణ ఇలా..

ఈ నేపథ్యంలో ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు నారులు వేసే పనిలో ఉన్న రైతులు నారుమడుల సంరక్షణకు అధిక ప్రాధాన్యం ఇవ్వాలని ఘంటసాల కృషి విజ్ఞాన కేంద్రం ప్రధాన శాస్త్రవేత్త, ప్రోగ్రాం కో ఆర్డినేటర్ డాక్టర్ పి.శ్రీలత తెలియజేశారు. మడులలో విత్తనాలు చల్లిన తర్వాత రెండు నుంచి మూడు రోజులలో నీరు మూడు కంటే ఎక్కువ రోజులు నిల్వ ఉంటే మొలక శాతం గణనీయంగా తగ్గుతుంది. ఈ తరుణంలో సాధ్యమైనంత త్వరగా నీరు బయటకు పోయే విధంగా చర్యలు చేపట్టి, విత్తనం కోర గాలి పోసుకునేలా చేస్తే నష్టం ఉండదు. అలా చేయకుండా ఎక్కువ రోజులు నీరు నిల్వ ఉంటే మొలక దెబ్బతిని, మళ్లీ నారు వేసుకోవాల్సిన పరిస్థితి ఏర్పడుతుంది. అలా నీరు తీసిన తర్వాత 5 సెంట్లలో వేసిన నారు మడికి ఒక కిలో యూరియా, ఒక కిలో మ్యూరేట్ ఆఫ్ పొటాష్ వేసుకోవడంతో కొత్త ఆకులొచ్చి నాట్లు వేసుకునేందుకు అనుకూలంగా ఉంటాయి.

తెగుళ్లు సోకకుండా..

అధిక వర్షాలకు నారుమడి దశలో తెగుళ్లు బారిన పడకుండా నీరు పూర్తిగా తీసివేసి మొక్క నిలదొక్కుకున్న తర్వాత ఒక లీటరు నీటికి ఒక గ్రాము కార్బండిజం మందు లేదా రెండు గ్రాముల కార్బండిజం, మాంకోజెబ్ కలిపిన మిశ్రమాన్ని పిచికారీ చేసుకోవాలి.

ముంపునకు గురైతే..

ఇప్పటికే నాట్లు వేసిన పొలాలు ముంపునకు గురైతే నీటని పూర్తిగా తీసివేసిన తర్వాత పైపాటుగా ఒక ఎకరానికి 20 కిలోల యూరియా, 20 కిలోల మ్యూరేట్ ఆఫ్ పొటాష్ ఎరువులను కలిపి చల్లుకోవడం ద్వారా మొక్క ముంపు నీటి ప్రభావం నుంచి కోలుకోవడానికి ఆస్కారం ఉంటుంది. కుళ్లు, తెగులు సోకకుండా ఒక లీటరు నీటికి ఒక గ్రాము కార్బండిజం మందు కలిపి పిచికారి చేసుకోవాలి.

వారాహిదేవికి కుంకుమ సమర్పణ



కె.కొత్తపాలెంలో కుంకుమ పూజలో ఆలయ నిర్వాహకులు రామకృష్ణ, నాగరాణి దంపతులు

కె.కొత్తపాలెం (మోపిదేవి): మండంలోని కె.కొత్తపాలెంలోని దుర్గా కోటేశ్వరస్వామి ఆలయంలో వారాహి అమ్మవారి నవరాత్రి మహోత్సవాలు మంగళవారం ముగిశాయి. చివరి రోజు ఉదయం శివలింగానికి ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం అమ్మవారు అర్ధనారీశ్వరి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. కుంకుమ పూజలో పాల్గొన్న మహిళలు అమ్మవారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఆలయ అర్చకులు విద్యాసాగర్‌శర్మ, వారాహి మూల మంత్రాలతో హోమం నిర్వహించగా, ఆలయ నిర్వాహకులు రామిశెట్టి రామకృష్ణ, నాగరాణి దంపతులు అమ్మవారికి పట్టువస్త్రాలు, పసుపు, కుంకుమ అందించారు. కలశ ఉద్వాసన, కలశ సంప్రోక్షణ చేసిన అనంతరం భక్తులకు అన్నసమారాధన నిర్వహించారు.

నేడు శ్రీమన్నారాయణుడికి అభిషేకాలు

కోడూరు: ఉల్లిపాలెంలోని గోదా, రాజ్యలక్ష్మీ సమేత శ్రీమన్నారాయణస్వామి మూలమూర్తికి బుధవారం ప్రత్యేక అభిషేకాలు నిర్వహించనున్నట్లు అష్టాక్షరీ పీఠాధిపతి త్రిదండి అష్టాక్షరీ సంపత్ కుమార రామానుజీయర్ స్వామిజీ మంగళవారం తెలిపారు. తొలి ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకొని ఉదయం 11 అడుగుల ఏకశిలా మూలమూర్తికి వేదపండితుల మంత్రోచ్ఛరణల నడుమ ప్రత్యేక పూజలు చేసి, అష్టోతరశత కలశ క్షీరాభిషేకాన్ని నిర్వహించనున్నట్లు చెప్పారు. కల్యాణాన్ని తిలకించేందుకు వచ్చే భక్తులకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామన్నారు.

నేడు కనకదుర్గమ్మకు ఆషాఢ వేడుక

నాగాయలంక: ఆషాఢ మాసం, తొలి ఏకాదశి పర్వదినం పురస్కరించుకుని స్థానిక కృష్ణా నదీ తీరాన శ్రీరామపాదక్షేత్రం ప్రాంగణంలో నక దుర్గమ్మ దేవస్థానంలో బుధవారం ఆషాఢ సారె వేడుక నిర్వహిస్తున్నట్లు క్షేత్రం చైర్మన్ ఆలూరి శ్రీనివాసరావు, నిర్వాహక ప్రతినిధి ఉప్పల లీలాకృష్ణ ప్రసాద్ మంగళవారం తెలిపారు. గ్రామంలోని బోసుబొమ్మ కూడలిలో శ్రీపోతురాజుస్వామి దేవస్థానం నుంచి ఆషాఢ సారె పళ్లాలు, పసుపు కుంకుమలను మహిళలు ఊరేగింపుగా దుర్గమ్మ గుడికి తీసుకొస్తారు. ఆలయ అర్చకుడు ముదునూరి శ్రీనివాసశాస్త్రి, అచ్యుత శేఖరశర్మ నేతృత్వంలో అమ్మవారికి ఆషాఢ సారె వేడుక జరుగుతుంది.

ఖాతాదారులకు మెరుగైన సేవలే లక్ష్యం



వ్యాపారితో మాట్లాడుతున్న రీజనల్ అధికారి విజయకుమార్, పక్కన బీఎం విహారి

నాగాయలంక: సమాజాభివృద్ధి లక్ష్యంతో ఖాతాదారులకు మెరుగైన సేవలు అందించడమే లక్ష్యంగా సప్తగిరి గ్రామీణ బ్యాంకు ముందడుగు వేస్తుందని ఆ బ్యాంకు గుడివాడ రీజనల్ అధికారి విజయ కుమార్ చెప్పారు. మంగళవారం స్థానిక సప్తగిరి గ్రామీణ బ్యాంకు బ్రాంచ్‌ను సందర్శించారు. నాగాయలంకలో క్షేత్రస్థాయిలో పర్యటించి వ్యాపార, వాణిజ్యవేత్తలు, రైతులు, రిటైర్డ్ ఉద్యోగులు, మహిళలను కలసి ఉమ్మడి చిత్తూరు, ఉమ్మడి కృష్ణాలో విస్తరించిన తమ బ్యాంకు సేవలపై అవగాహన కల్పించారు. గత ఏడాది మే నెలలో ఇక్కడ ఆరంభించిన 235వ బ్రాంచి ద్వారా గోల్డ్ లోన్స్, రైతు రుణాలు, చేపలు, రొయ్యల చెరువుల సంబంధిత రుణాలు, విద్యారుణాలు, గృహ రుణాలు అందించడంతో పాటు వాణిజ్య బ్యాంకులలో లభ్యమయ్యే అన్ని సేవలు అందిస్తున్నామని తెలిపారు. ఈప్రాంత రైతులు, డ్వాక్రా మహిళలు బ్యాంకు సేవలను సక్రమంగా వినియోగించుకుని బ్యాంకు పురోభివృద్ధికి తోడ్పాటు అందించాలన్నారు. బ్రాంచి మేనేజర్ బీజే విశల్ విహారి, గోల్డ్ అప్రైజర్ లేబాక నాగేశ్వరరావు, సిబ్బంది పాల్గొన్నారు.

దోమల నివారణ మందు పిచికారీ

కూచిపూడి(మొవ్వ): గ్రామాల్లో మలేరియా, డెంగీ, విష జ్వరాలబారిన పడకుండా మొవ్వ మండలం కూచిపూడిలో ముందస్తుగా దోమల నిర్మూలనకు దోమల నివారణ మందును పారిశుద్ధ్య కార్మికులు మంగళవారం పిచికారీ చేశారు. అలాగే రహదారుల వెంబడి బ్లీచింగ్ పౌడర్‌ను చల్లారు.

రూ.2 లక్షలతో ఎంపీడీవో కార్యాలయం ఆధునికీకరణ



పెడన: మండల పరిషత్ కార్యాలయంలోని ఎంపీపీ, ఎంపీడీవో ఛాంబర్లు, ఏవో, సిబ్బంది గదులను ఆధునికీకరిస్తున్నారు. మండల పరిషత్ జనరల్ ఫండ్స్ రూ.2 లక్షలతో ఈ పనులు చేపట్టారు. ఇప్పటికే ఎంపీపీ ఛాంబరుతో పాటు ఎంపీడీవో ఛాంబర్లలో ఏసీ, ఫర్నిచర్ ఏర్పాటు పనులు పూర్తిచేశారు. ఏవో, సిబ్బంది ఉన్న రూం పనులు మొదలు పెట్టారు. నాలుగైదు రోజుల్లో ఈ పనులు కూడా పూర్తవుతాయని పంచాయతీ రాజ్ ఇన్‌చార్జి ఏఈ హార నాథ్ తెలిపారు.

ఉచితంగా వరి విత్తనాలు సరఫరా చేయాలి

పామర్రు: ఉచితంగా వరి విత్తనాలను రైతులకు సరఫరా చేయాలని పామర్రు మాజీ ఎమ్మెల్యే డీవై దాసు కోరారు. స్థానిక కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో మంగళవారం ఆయన మాట్లాడుతూ గత రెండు రోజులుగా కురిసిన వర్షాలతో నారుమళ్లతో పాటు వెదజల్లిన పొలాలు నీటమునిగి దెబ్బతిన్నాయన్నారు. దీంతో ఖరీఫ్ సాగు ప్రారంభంలోనే రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని జిల్లా వ్యవసాయ శాఖ అధికారి పద్మావతికి తెలియజేశామని తెలిపారు. దెబ్బతిన్న పొలాలను పరిశీలించి, వారికి ఉచితంగా వరి విత్తనాలను అందజేయాలని కోరినట్లు పేర్కొన్నారు.

ఆయిల్‌పామ్ తోటల సాగుపై అవగాహన

హనుమాన్‌జంక్షన్ రూరల్: కొత్తగా ఆయిల్‌ఫామ్ తోటలు సాగు చేసే రైతులకు ప్రభుత్వం ప్రోత్సాహకాలను అందిస్తుందని మండల ఉద్యాన అధికారి ఇ.హరిచంద్ అన్నారు. బాపులపాడు మండలం రంగన్నగూడెంలో ఉద్యాన శాఖ, పతాంజలి ఫుడ్స్ సంయుక్త ఆధ్వర్యంలో ఆయిల్‌పామ్ తోటల సాగుపై రైతులకు మంగళవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొత్తగా ఆయిల్‌పామ్ సాగు చేపట్టిన రైతులకు దేశీయ మొక్కలకైతే హెక్టారుకు రూ. 20 వేలు, విదేశీ మొక్కలకైతే హెక్టారుకు రూ. 29 వేలు చొప్పున ప్రోత్సాహకాన్ని ప్రభుత్వం అందిస్తుందని తెలిపారు. ఆయిల్‌పామ్ మొక్కలు నాటిన తర్వాత నాలుగేళ్ల పాటు ఏటా హెక్టారుకు రూ. 5,250 ప్రోత్సాహకాన్ని అందిస్తామని పేర్కొన్నారు. ఆయిల్‌పామ్ తోటలో అంతర పంటల సాగు ద్వారా అదనపు ఆదాయం పొందవచ్చని వివరించారు. కార్యక్రమంలో సర్పంచ్ కసుకుర్తి రంగామణి, ఎంపీటీసీ సభ్యుడు పుసులూరి లక్ష్మీనారాయణ, పాల్గొన్నారు.

రోడ్ల అభివృద్ధికి రూ.15 లక్షల ఎంపీ నిధులు



మోపిదేవిలో వెంకట రమణారావును కలిసిన శివనాగమల్లేశ్వరరావు

మోపిదేవి: అవనిగడ్డ నియోజకవర్గంలోని మూడు పంచాయతీలలో రోడ్ల నిర్మాణానికి రూ.15 లక్షల నిధులు మంజూరు చేస్తామని రాజ్యసభ సభ్యుడు మోపిదేవి వెంకట రమణారావు హామీ ఇచ్చారు. మోపిదేవిలో శ్రీవల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి వారిని మంగళవారం ఆయన దర్శించుకున్నారు. ఈ సందర్భంగా కోసూరువారిపాలెం గ్రామ సర్పంచ్ కోసూరు అనూష భర్త శివనాగమల్లేశ్వరరావు మర్యాద పూర్వకంగా ఎంపీని రమణారావును కలిశారు. ఈ సందర్భంగా రోడ్ల అభివృద్ధికి నిధులు మంజూరు చేయాలని విన్నవించగా ఆయన సానుకూలంగా స్పందించారు. కోసూరువారిపాలెంతో పాటు ఉత్తరచిరువోలులంక, కోడూరు మండలంలోని విశ్వనాథపల్లి గ్రామల్లో రోడ్ల అభివృద్ధికి ఒకొక్క గ్రామానికి రూ.5 లక్షల చొప్పున మూడు గ్రామాల రోడ్లకు రూ.15 లక్షలు నిధులు త్వరలో మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు.

గ్రామాల్లో ప్రత్యేక వైద్యశిబిరాలు నిర్వహించాలి



రోగులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బుద్ధప్రసాద్

కోడూరు: సీజనల్ వ్యాధులు ప్రబలకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరిస్తూ గ్రామాల్లో ప్రత్యేక వైద్యశిబిరాలు నిర్వహించాలని ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ అన్నారు. మంగళవారం కోడూరు పీహెచ్‌సీలో బుద్ధప్రసాద్ ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. తీరప్రాంత గ్రామాల్లో మురుగునీటి నిల్వల వల్ల దోమలు ప్రబలే అవకాశం ఉందని, దోమల నివారణకు తగిన చర్యలు తీసుకోవాలని బుద్ధప్రసాద్ సూచించారు. వైద్యులు ఆసుపత్రిలో రోగులకు అందుబాటులో ఉండి, అత్యవసర కేసులు మినహాయించి సాధారణ కేసులకు ఇక్కడే చికిత్స చేయాలన్నారు. అనంతరం ఆసుపత్రి ప్రాంగణమంతా తిరిగి పరిశీలించారు. వార్డులో చికిత్స పొందుతున్న రోగుల ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. వైద్యుల పనితీరుపై సంతృప్తి వ్యక్తం చేశారు. వైద్యాధికారి ప్రతిమ రికార్డులను మండలికి చూపించారు. కూటమి నేతలు, సిబ్బంది పాల్గొన్నారు.

కోడూరు: వ్యవసాయ పనులు ప్రారంభమైన నేపథ్యంలో రైతులు, కూలీలు పాముకాట్లు పట్ల అప్రమత్తంగా ఉండాలని ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ అన్నారు. మంగళవారం కోడూరు పీహెచ్‌సీని పరిశీలించి, మీడియాతో మాట్లాడారు. అన్నదాతలు, కూలీలు అప్రమత్తంగా వ్యవహరించి పనులు చేసుకోవాలని, ప్రమాదవశాత్తు పాముకాటుకు గురైతే వెంటనే దగ్గరలోని పీహెచ్‌సీకి వెళ్లాలని సూచించారు. మూఢనమ్మకాలను విడనాని యాంటీస్నేక్ వీనం విరుగుడు మందును తీసుకోవాలని సూచించారు. వ్యవసాయ, వైద్య, పంచాయతీ, రెవెన్యూ, సచివాలయ ఉద్యోగులు పాముకాట్లపై అవగాహన కల్పించాలని ఆదేశించారు.

అందుబాటులో యాంటీస్నేక్ వీనం..

నియోజకవర్గంలోని అన్ని పీహెచ్‌సీ కేంద్రాల్లో యాంటీస్నేక్ వీనం వైల్స్ అందుబాటులో ఉన్నాయని ఎమ్మెల్యే తెలిపారు. ఒక్క కోడూరు పీహెచ్‌సీలోనే ప్రస్తుతం 85 వైల్స్ అందుబాటులో ఉన్నాయన్నారు. చిన్నారులకు వేసే టీకాల విషయంతో కూడా ప్రత్యేక శ్రద్ధ వహించాలని వైద్యసిబ్బందిని ఆదేశించారు. వైద్యాధికారి ప్రతిమ, సిబ్బంది పాల్గొన్నారు.

50 పడకల ఆస్పత్రిగా తీర్చిదిద్దుతా..

చల్లపల్లి(అవనిగడ్డ): చల్లపల్లి కమ్యూనిటీ ప్రభుత్వ వైద్యశాలను 50 పడకల ఆసుపత్రిగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తానని ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ చెప్పారు. మంగళవారం వైద్యశాలను ఆయన ఆకస్మిక తనిఖీ చేశారు. అన్ని గదులను ఆయన పరిశీలించి వైద్యసేవలను తెలుసుకున్నారు. నిర్మాణం పూర్తయి ఇంకా వినియోగంలోకి రాని పై అంతస్తును చూశారు. అనంతరం ఇన్‌చార్జి సూపరింటెండెంట్ డాక్టర్ శ్రీరంగం, డాక్టర్ మహేష్‌తో మాట్లాడారు. ఆసుపత్రి అవసరాలపై చర్చించారు. 50 పడకల వైద్యశాలగా తీర్చిదిద్దేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని సూచించారు.

అగ్నిప్రమాద బాధితులకు సాయం

చల్లపల్లి(అవనిగడ్డ): చల్లపల్లి నారాయణరావునగర్ ఎస్టీ కాలనీలో ఇటీవల అగ్నిప్రమాదంలో నష్టపోయిన బాధితులకు ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ రూ.70 వేలు ఆర్థిక సహాయం అందించారు. ఈ ప్రమాదంలో గరికపాటి యశోద గృహం పూర్తిగా కాలిపోగా ఆమెకు ఎస్టీ కార్పొరేషన్ ద్వారా రూ.50 వేలు, పాక్షికంగా దెబ్బతిన్న కుంభా వెంకయ్య కుటుంబానికి రూ.20 వేలు ఆర్థిక సాయాన్ని బుద్ధప్రసాద్ అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ యశోదకు పక్కా గృహ నిర్మాణం కోసం రూ.1.80 లక్షలు, ఎస్టీ కార్పొరేషన్ ద్వారా రూ.63 వేలు, లబ్ధిదారు వాటా కింద రూ.27తో పక్కా గృహం నిర్మించేందుకు చర్యలు తీసుకుంటామని చెప్పారు. కుంభా వెంకయ్యకు రెండో విడతలో పక్కా గృహం మంజూరు అయ్యేలా కృషి చేస్తానన్నారు. ఎంపీపీ కోట విజయరాధిక, సర్పంచ్ పైడిపాముల కృష్ణకుమారి, వైఎస్ ఎంపీపీ మోర్ల రాంబాబు, ఇన్‌చార్జి ఎంపీడీవో బూరేపల్లి అశోక్, పంచాయతీ ఈవో మాధవేంద్రరావు, శ్రీకాకుళం సర్పంచ్ ముప్పనేని రవి ప్రసాద్, పలువురు అధికారులు, సిబ్బంది, జనసేన పార్టీ నాయకులు పాల్గొన్నారు.



బురదకయ్యను తలపిస్తున్న యర్రారెడ్డివారిపాలెం అంతర్గత రోడ్డు



చిత్తడి చిత్తడిగా మారిన నాయుడుపేట రోడ్డు



సంతమార్కెట్ వద్ద ప్రధాన రహదారి దుస్థితి



మెరకగౌడపాలెం వద్ద రామకృష్ణాపురం ప్రధాన రోడ్డుపై బురద



కోడూరు మండల పరిషత్ కార్యాలయం సమీపంలో రోడ్డు

చిత్తడి చిత్తడిగా రహదారులు

కోడూరు: నాలుగు రోజుల నుంచి కురుస్తున్న వర్షాలకు రోడ్లు చిత్తడి చిత్తడిగా మారాయి. ప్రధాన రోడ్లతో పాటు అంతర్గత రహదారులు అధ్వానంగా మారాయి. ప్రధాన రహదారులపై వర్షం నీరు నిల్వ ఉండి ప్రమాదభరితంగా మారితే అంతర్గత రహదారులు బురదకయ్యలను తలపిస్తున్నాయి. కోడూరు పంచాయతీ పరిధిలోని యర్రారెడ్డి వారిపాలెం ఊర చెరవుకు వెళ్లే రోడ్డుపై బురద పేరుకుపోయింది. నాయుడుపేటకు వెళ్లే రోడ్డు పరిస్థితి దారుణంగా ఉంది. ప్రధాన సెంటర్‌లోని సంతమార్కెట్ వద్ద ప్రధాన రోడ్డుపై, రామకృష్ణాపురానికి వెళ్లే రహదారిలో మెరకగౌడపాలెం వద్ద బురద పేరుకుపోయి వాహనచోదకులు సర్కస్ ఫీట్లు చేస్తున్నారు. లింగారెడ్డిపాలెం, పిట్టల్లంక, వి.కొత్తపాలెం, మందపాకల గ్రామా ల్లోని అంతర్గత రోడ్ల పరిస్థితి ఇదే విధంగా ఉన్నాయి. ఆయా పంచాయతీల అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి సీసీ రోడ్లు నిర్మించాలని కోరుతున్నారు.